# మార్చిలో అమరావతి ఇన్నోవేషన్స్ సమ్మిట్

అమరావతి, డిసెంబర్ 27 : 'సిటీస్ ఆఫ్ ద ఫ్యూచర్' పేరుతో మార్చి నెలాఖరులో అమరావతి ఇన్నోవేషన్ సమ్మిట్‌కు రాజధాని వేదిక కానున్నది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సు అమరావతి నగర రూపకల్పనలో సరికొత్త దిశానిర్దేశాన్ని అందిస్తుందని భావిస్తున్నారు. ఈ సమ్మిట్‌కు సంబంధించిన ప్రతిపాదనలను బుధవారం రాత్రి సచివాలయంలో రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ సమావేశంలో కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. ఈ సదస్సు ప్రధానంగా నగర అభివృద్ధి ప్రణాళికలకు సంబంధించినది. ఆధునిక సాంకేతికత, నవ్య ఆవిష్కారాలు, వినూత్న విధానాల మేళవింపుతో నగర రూపకల్పన జరపడానికి దోహదపడేలా సదస్సులో మేధోమధనం జరపనున్నారు. అంతేగాక, అమరావతిని విశ్వశ్రేణి నగరంగా అభివృద్ధి చేస్తున్న తీరును ప్రజాబాహుళ్యానికి విపులంగా విడమర్చి చెప్పేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని భావిస్తున్నారు. దీనికోసం రాజధాని పరిధిలోని పలు ప్రాంతాలలో హ్యాపీసిటీ హ్యాకథాన్ నిర్వహిస్తారు. నగర నిర్మాణాలలో ప్రఖ్యాతిగాంచిన నిపుణులతో మొదటి రెండు రోజులూ బృంద చర్చలు, కార్యగోష్ఠులు ఉంటాయి. చివరిరోజు అమరావతిని విశ్వస్థాయి నగరంగా 21వ శతాబ్దం వైపు నడిపించేందుకు అవసరమైన వినూత్న సాంకేతిక విధానాలు, ఆవిష్కారాలకు సంబంధించిన పోటీలను నిర్వహిస్తారు. నూతన ఆవిష్కరణలు, నవ్య సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన అంశాలలో వచ్చే 15 ఏళ్లలో ప్రపంచంలోనే అత్యధిక ఆర్థిక కార్యకలాపాలు భారత్‌లో సాగనున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తుచేశారు. రేపటి అవసరాలకు తగినట్టుగా ఇప్పటి నుంచే సిద్ధం కావాలని ఏడీసీ, సీఆర్‌డీఏ అధికారులకు సూచించారు. ఇన్నోవేషన్ సమ్మిట్‌ను ఒక పర్యాయం నిర్వహించి వదిలేయకుండా ఏటా క్రమంతప్పకుండా దీన్ని ఒక క్రతువుగా నిర్వహించి నగర అభివృద్ధి విషయంలో ప్రపంచ గమనంతో సమానంగా పోటీ పడాలని సూచించారు. రాజధాని ప్రాంతాన్ని మొత్తం వెంటనే సుందరీకరించాలని ముఖ్యమంత్రి సమావేశంలో ఆదేశించారు. గుంటూరు–విజయవాడ జాతీయరహదారి మార్గంలో పచ్చదనం వెల్లివిరిసేలా తీర్చిదిద్దాలని చెప్పారు.

రాజధాని పరిధిలోని శాఖమూరు, ఐనవోలు గ్రామాలలోని 198.52 ఎకరాల ప్రాంతాన్ని ఐటీ పార్కుగా గుర్తించడానికి సమావేశం ఆమోదం తెలిపింది. ఇందులో ఐనవోలు గ్రామ పరిధిలోని 53.10 ఎకరాల ప్రదేశాన్ని ఐటీ సెజ్‌గా గుర్తించడానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించాలని సమావేశం నిర్ణయించింది. శాఖమూరు ఉద్యాన వనం అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలను అమరావతి అభివృద్ధి సంస్థ సీఎండీ లక్ష్మీపార్థసారథి ముఖ్యమంత్రికి వివరించారు. రాజధాని ప్రాంతంలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా జరుగుతున్న వివిధ నిర్మాణాలపై ముఖ్యమంత్రి సమీక్షించి అధికారులకు తగు ఆదేశాలు ఇచ్చారు. రాజధాని ప్రాంతంలో జరుగుతున్న రహదారి నిర్మాణాలు ఏప్రిల్ నాటికి పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తామని అధికారులు చెప్పగా, అంతకంటే ముందే పూర్తిచేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు.